క్లుప్తంగా

మసీదుకు సీసీ కెమెరాల వితరణ



కంకిపాడు: ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని తుమ్మలపల్లి పరమేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి హరికృష్ణ పిలుపునిచ్చారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈడుపుగల్లు మసీదుకు రూ.50 వేల విలువైన సీసీ కెమెరాలను శనివారం రాత్రి అందించారు. హరికృష్ణ మాట్లాడుతూ.. ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆపన్నులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మసీదు ప్రెసిడెంట్ షేక్ కరీముల్లా, కార్యదర్శి షేక్ గూడు సాహెబ్, ట్రెజరర్ షేక్ బాషా, షేక్ అల్లా నబీ, షేక మాబుసుభాని, షేక్ మస్తాన్‌వలీ, ఏనుగ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



పెనమలూరు: తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బహుమతులు పంపిణీ చేశారు. గ్రామంలో వారం రోజులుగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరం ఆదివారం ముగింపు సందర్భంగా విద్యార్థులకు వికసిత భారత్ అనే అంశంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర మాట్లాడుతూ.. వారం రోజులుగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలో ప్రాథమిక విద్య, రోడ్డు భద్రత, ఓటు హక్కుపై అవగాహన, స్వచ్ఛభారత్, ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారన్నారు. గ్రామస్తుల సహకారంతో ఎన్ఎస్ఎస్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిర్మల, శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఆదివారం రాత్రి అన్నపూర్ణ సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. దేవస్థానం ఆవరణలో జరిగిన వేడుకలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ముందుగా చెరువు సెంటర్‌లో స్వామి వార్ల వివాహానికి సంబంధించిన రాయభారం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెండ్లి చూపుల దగ్గర నుంచి సప్తరుషుల రాయభారం కార్యక్రమం చూడముచ్చటగా జరిగింది. కల్యాణోత్సవంలో 19మంది దంపతులు పాల్గొన్నారు. దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి ఎస్.అరుణ, ప్రధాన అర్చకులు ఎం.ఫణికుమార్ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

చురుగ్గా రహదారి అభివృద్ధి పనులు



కంకిపాడు: మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో చేపట్టిన ప్రధాన రహదారి అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలోని గంగానమ్మ ఆలయం నుంచి పెద ఓగిరాల-బొడ్డపాడు ఆర్అండ్‌బీ రహదారిని కలిపే జిల్లా పరిషత్ రోడ్డు అధ్వానంగా ఉండటంతో రోడ్డు అభివృద్ధికి జెడ్పీటీసీ బాకీ బాబు రూ.10 లక్షల నిధులు జెడ్పీ నుంచి కేటాయించేలా కృషి చేశారు. నిధులు మంజూరు కావటంతో పంచాయతీరాజ్ అధికారులు రోడ్డు అభివృద్ధి పనులను ఆదివారం చేపట్టారు. రోడ్డు పనులను ఆ శాఖ డీఈ శ్రీనివాసరావు, ఏఈ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. నిర్మాణ పనుల్లో లోటుపాట్లు తలెత్తకుండా తనిఖీలు చేశారు.

రేపు ఆలయ భూముల కౌలు వేలం

పెనమలూరు: పోరంకి గ్రామంలోని శ్రీ వసంత వేణుగోపాలస్వామి, శ్రీ ఆంజనేయ స్వామివార్ల దేవస్థానానికి చెందిన భూమి కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం వివరాలు తెలుపుతూ గ్రామంలో ఆర్ఎస్ నంబర్ 420/1లో ఉన్న 7.75 ఎకరాల వ్యవసాయ భూమి కౌలు హక్కులు టెండర్ కం బహిరంగ వేలం ఈ నెల 26వ తేదీన నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 2 గంటలకు దేవదాయ, ధర్మదాయ అధికారుల సమక్షంలో వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు నిబంధనలకు లోబడి వేలంలో పాల్గొనాలని కోరారు.

తాగునీటి కష్టాలకు చెక్

- పెనమలూరులో రూ.కోటితో పనులు
- రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణం
- 3,500 మీటర్ల పైప్‌లైన్ నిర్మాణం

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో తాగునీటి సమస్యకు ప్రభుత్వం చెక్ పెట్టింది. దాదాపు రూ.కోటితో చేపట్టిన రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణం పనులు ముగింపు దశకు వచ్చాయి. ఇక గ్రామంలో ప్రజలకు పుష్కలంగా తాగునీరు సరఫరా కానుంది. పెనమలూరు గ్రామంలో దాదాపు 23 వేల జనాభా ఉన్నారు. పేదలు నివశించే ప్రాంతాల్లో ప్రభుత్వం రక్షిత మంచినీటి పథకం అమలు చేస్తుంది. గ్రామంలో కుళాయి కనెక్షన్‌లు 2,200 వరకు ఉన్నాయి. ఇంకా మరో వెయ్యి కనెక్షన్‌లు ఇవ్వటానికి వాటర్ ట్యాంకులు లేవు. దీంతో డైరెక్టు బోర్‌లు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్నారు. పల్లిపేట, పచ్చళ్ల కంపెనీ కట్ట, అంబేడ్కర్ కాలనీ, ప్రకృతి హోమ్స్, హైస్కూల్ ప్రాంతాల్లో డైరెక్టు బోర్లు వేసి నీరు అందిస్తున్నారు. అయితే గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని ప్రణాళిక రూపొందించారు.

కొత్త పైప్‌లైన్ నిర్మాణం..

గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చేయటానికి ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. ఇందులో రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ల పనులను కొద్ది నెలల క్రితం ప్రారంభించారు. సుగాలీ కాలనీలో పేదలకు నీటి సమస్య రాకుండా ఉండాలని అక్కడ రూ.31 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకు నిర్మాణం చేశారు. దీంతో పేదలు నివశించే పల్లిపేట, సుగాలీకాలనీ వాసులకు పుష్కలంగా నీరు అందనుంది. అదే విధంగా ప్రకృతిహోమ్స్ వద్ద రూ.33 లక్షలతో 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మించారు. చెరువు కట్ట, అంబేడ్కర్‌కాలనీ ప్రాంతాల్లో తాగునీరు సమస్య తీరుతుంది. గ్రామంలో ప్రస్తుతం 5 వాటర్ ట్యాంకులు ఉండగా అదనంగా రెండు కలిపి మొత్తం 7 వాటర్ ట్యాంకులు అయ్యాయి. కొత్తగా నిర్మించిన వాటర్ ట్యాంకులు రెండు త్వరలో ప్రారంభించనున్నారు. కాగా కలుషిత నీరు సరఫరా జరగకుండా ఉండటానికి పాత పైప్‌లైన్‌లు తొలగించి రూ.37 లక్షలతో 3,500 మీటర్ల మేర నూతన పైప్‌లైన్‌ల నిర్మాణం చేశారు. అదే విధంగా పైప్‌లైన్‌లు లేని ప్రాంతాల్లో కూడా కొత్త పైప్‌లైన్ నిర్మాణం చేశారు. పెనమలూరు గ్రామంలో తాగునీరు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది.



సుగాలీ కాలనీలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు



ప్రకృతి హోమ్స్ వద్ద నిర్మించిన వాటర్ ట్యాంకు

సకాలంలో చర్యలు..

గ్రామంలో తాగునీరు సమస్య పరిష్కారానికి ప్రభుత్వం, గ్రామ పంచాయతీ సకాలంలో స్పందించి నిధులు మంజూరు చేశారు. రెండు వాటర్ ట్యాంకులు వేగంగా నిర్మించారు. భవిష్యత్తులో గ్రామంలో తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

– కె.రామచంద్రరావు, గ్రామస్తుడు, పెనమలూరు



త్వరలో ట్యాంకుల ప్రారంభం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జల్‌జీవన్ మిషన్ నిధులతో రెండు వాటర్ ట్యాంకులు నిర్మించాం. శివారు ప్రాంతాలకు ఇక తాగునీటి సమస్య లేకుండా చేశాం. కొత్త వాటర్ ట్యాంకులు త్వరలో ప్రారంభిస్తాం. ప్రజలకు సమృద్ధిగా నీరందిస్తాం.

– లింగాల భాస్కరరావు, సర్పంచ్, పెనమలూరు



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



ఈడుపుగల్లులో సమావేశమైన 1993-94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కంకిపాడు: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం సందడిగా సాగింది. ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 బ్యాచ్ పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 31 సంవత్సరాల తరువాత గ్రామం సమీపంలోని విజయ గార్డెన్స్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అంతా ఒక చోట చేరి సంతోషంగా గడిపారు. స్నేహితులు అంతా ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులు, ఆటపట్టింపులతో సందడి చేశారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమాన్ని పందిపాటి సుధాకర్, సుబ్రహ్మణ్యం, రాజేష్, ప్రసాద్, సుభాని, కల్యాణి, శైలజ, రామలక్ష్మి, పద్మ పర్యవేక్షించారు.

వాసవీ సేవలు విస్తృతం చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వాసవీ సంస్థలు సేవలను మరింత విస్తృతం చేయాలని ఆ సంస్థ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. వాసవీ ఇంటర్నేషనల్ మొదటి కేబినెట్ మీటింగ్ పాతబస్తీలోని పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. హజరతయ్యగుప్తా మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు వాసవీ సంస్థలు చక్కని సేవలందిస్తున్నాయన్నారు. రానున్న కాలంలో మంచి ప్రణాళికతో వాసవి సంస్థలు ముందుకు దూసుకుపోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన వాసవీ గవర్నర్ కొత్త గణేష్‌బాబు మాట్లాడుతూ వాసవీ, వాసవీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పాలకుర్తి గాయిత్రి, మామిడి శ్రీనివాసరావు, ఎంవీఎస్ రామచంద్రరావు, తాతా రజనీకుమారి, శనగపల్లి సురేష్, చిట్టూరి శ్రీనివాసరావు, అన్నం సాయి సునీత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

ఉంగుటూరు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద అవుటపల్లి తంబి పుణ్యక్షేత్రంలో రెక్టర్ ఫాదర్ పాలడుగు జోసఫ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొబ్బరి ఆకులు, ఈత మట్టలను పుష్పాలతో అలంకరించి గ్రామ ప్రధాన మార్గాల్లో యుధలకు రాజుకు, క్రీస్తురాజుకు జయం, జయం అంటూ హోసన్న స్తుతి గీతాలతో ఊరేగింపు చేపట్టారు. తేలప్రోలు, మానికొండ, ఉంగుటూరు, ఆత్కూరు, పొట్టిపాడు తదితర గ్రామాల్లో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు, పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మట్టల ఆదివారం

గన్నవరంరూరల్: ముస్తాబాద, కొండపావులూరు, చిక్కవరం తదితర గ్రామాల్లో భక్తులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దేవాలయాల నుంచి ప్రారంభమై ఆయా గ్రామాల్లో ఊరేగింపుగా క్రీస్తు ప్రభువును ఆరాధిస్తూ ప్రదర్శనలు చేపట్టారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

విజయవాడరూరల్: మట్టల ఆదివారాన్ని పురస్కరించుకొని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా ఈతమట్టలకు రకరకాల పువ్వులను అలంకరించి ఆనందోత్సాహాలతో ప్రదర్శనలు చేశారు. అంబాపురం గ్రామంలో చర్చి పాస్టర్ సీహెచ్.జయరాజు, నున్న గ్రామంలో డీనరీ చైర్మన్ కె.జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో సీఎస్ఐ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాతపాడు, రామచంద్రపురం గ్రామాల్లోని సీఎస్ఐ, ఆర్సీఎం చర్చిల్లో, లూథరన్, బాప్టిస్టు, రక్షణ సైన్యం, హోసన్న, పెంతుకోస్తు తదితరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కార్మెల్‌మాత పుణ్యక్షేత్రం ఆధ్వర్యంలో

పెనమలూరు: కానూరు కార్మెల్‌మాత పుణ్యక్షేత్రం ఆధ్వర్యంలో మానుకొమ్మల ఆదివారం పండుగ ఘనంగా జరిగింది. పుణ్యక్షేత్రం ఫాదర్ చాలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో కామయ్యతోపు ఆర్సీఎం చర్చి నుంచి ఈతమట్టలతో భక్తులు హోసన్నా గీతాలతో కానూరు ప్రధాన రహదారి నుంచి కార్మెల్‌చర్చి వరకు ప్రదర్శన నిర్వహించారు. భక్తులు దివ్యబలి పూజలో పాల్గొన్నారు. భక్తులకు దివ్య ప్రసాదం అందించారు. కామయ్యతోపు ఆర్సీఎం చర్చిలో ఉదయం ఫాదర్లు దేవదానం, రత్నాకర్ నిర్వహించారు. భక్తులకు కిరణ్ కుటుంబం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

జంక్షన్‌లో ప్రత్యేక ప్రార్థనలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక జ్యోతినగర్‌లోని ఆర్సీఎం చర్చిలో మట్టల ఆదివారం పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే గుడ్‌ఫ్రైడే ముందు వచ్చే ఆదివారం ఎంతో పవిత్రమైన రోజుగా బైబిల్‌లో పేర్కొనబడిందని ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి తెలిపారు. అనంతరం అధిక సంఖ్యలో క్రైస్తవులు మట్టలతో పెరికీడులోని మరియమాత టవర్ నుంచి క్రీస్తు శిలువ వరకు ర్యాలీ నిర్వహించారు. బండారుగూడెంలోని సీఎస్ఐ చర్చిలోనూ మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ కిషోర్ ఆధ్వర్యంలో సంఘస్తులు క్రైస్తవ గీతాలు ఆలపిస్తూ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.



పెద్ద అవుటపల్లిలో ఊరేగింపుగా వెళ్తున్న విశ్వాసులు



కానూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న ఫాదర్ శౌరి



అంబాపురంలో మట్టలతో ఊరేగింపు చేస్తున్న పాస్టర్ జయరాజు, క్రైస్తవులు



జ్యోతినగర్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

టీడీపీలో చేరిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి

గన్నవరం: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తూ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు టీడీపీ సమావేశానికి హాజరయ్యారు. వీరిలో ఒకరు ఏకంగా టీడీపీ కండువా కప్పించుకుని ఆ పార్టీలో చేరాడు. కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామానికి చెందిన కోటేశ్వరరావు స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కానూరులో శనివారం జరిగిన టీడీపీలో చేరికల కార్యక్రమానికి కోటేశ్వరరావు హాజరయ్యాడు.

అంతే కాకుండా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకుని టీడీపీలో చేరాడు. అయితే గన్నవరం నియోజకవర్గానికి సంబంధం లేని కోటేశ్వరరావును రఫీ అనే నాయకుడు వెంట తీసుకువెళ్లి టీడీపీలో చేర్చడం గమనార్హం. ఇదే కార్యక్రమానికి బీబీ.గూడెంకు చెందిన గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డులో అవుట్ సోర్సింగ్ కార్మికుడు అనిల్‌కుమార్ కూడా హాజరయ్యారు.



యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో టీడీపీలో చేరిన కోటేశ్వరరావు

వైభవంగా బాల పేరంటాలమ్మ గ్రామోత్సవం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని శ్రీ బాల పేరంటాలమ్మ గ్రామోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం అఖండ దీపారాధనతో పూజా కార్యక్రమా లు ప్రారంభమయ్యాయి. ఈ పూజా కార్యక్రమాల్లో గ్రామంతో పాటు సమీప గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం తరుపున బాల పేరంటాలమ్మకు పసుపు, కుంకుమను ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి సమర్పించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవార్ల గ్రామోత్సవాన్ని రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో కనుల పండువగా నిర్వహించారు.



పసుపు, కుంకుమ సమర్పిస్తున్న ఈఓ లోకేశ్వరి, చైర్మన్ భాను తదితరులు

మంత్రికి ఆటో వర్కర్స్ యూనియన్ మద్దతు

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులు మద్దతు పలికారు. గంగూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం తాడిగడప మున్సిపాలిటీ ఆటో వర్కర్స్ యూనియన్ నేతలు మంత్రి జోగి రమేష్‌ను కలిసి తమ మద్దతు ప్రకటించారు. పెనమలూరులో వైఎస్సార్ సీపీ గెలుపునకు ఆటో వర్కర్స్ పని చేస్తామని తెలిపారు. ఆటో వర్కర్‌లకు అండగా ఉంటానని మంత్రి జోగి రమేష్ తెలిపారు.

టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలోకి

కానూరు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో చేరారు. గంగూరులోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కానూరు టీడీపీకి చెందిన 50 కుటుంబాలు రుద్రాదేవి నాయకత్వంలో వైఎస్సార్ సీపీలో చేరగా మంత్రి జోగి రమేష్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.



పార్టీలో చేరిన ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులతో మంత్రి జోగి రమేష్

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

గన్నవరం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ షాహనాజ్ మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా భావించి కళ్లె పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. ఆరు నెలలు పాటు క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా క్షయ వ్యాధిని నిరోధించవచ్చన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ వి.సాంబశివరావు, టీబీ సూపర్‌వైజర్ ఏడీ రఘునాథ్, ఎస్టీఎల్ఎస్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరు: టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాసరావు అన్నారు. పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ప్రపంచ టీబీ నివారణ దినోత్సవం కార్యక్రమం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. టీబీ అంటువ్యాధని, ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద పీహెచ్‌సీలో ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ సృజన మాట్లాడుతూ.. వ్యాధి లక్షణాలు ఉన్న వారు ఆరోగ్య కేంద్రంలో కళ్లె పరీక్ష చేయించుకోవాలన్నారు. బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవటం ద్వారా క్షయవ్యాధి బారిన పడకుండా ఉండవచ్చన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ వి.సాంబశివరావు, టీబీ సూపర్‌వైజర్ రఘునాథ్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



గన్నవరంలో ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో కొత్త భీమవరపు వారి ఇలవేల్పు రేణుకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిగింది. గ్రామంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాజీవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, సర్పంచ్ ఈ.శివనాగలక్ష్మి, ఎంపీటీసీ బేతపూడి సురేష్, భీమవరపు గిరిరెడ్డి, భీమవరపు రమేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బీహెచ్ శివరామకృష్ణారెడ్డి, బీహెచ్ రాజగోపాల్‌రెడ్డి, బీహెచ్ నాగిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న రాజీవ్, భక్తులు

కానూరులో తిరుపతమ్మ తిరునాళ్ల

పెనమలూరు: కానూరులో శ్రీగోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ తిరనాళ్లు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతన ఆలయ నిర్మాణం చేయగా అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు పలు గ్రామాల నుంచి తరలివచ్చి పెద్ద సంఖ్యలో తిరునాళ్లలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఉచిత ప్రసాదం అందజేసింది. రాత్రి 7 గంటలకు గ్రామంలో ప్రభోత్సవం నిర్వహించారు. విద్యుత్ కాంతులతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ప్రభలకు రంగురంగు విద్యుత్ దీపాలు అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. బేతాళ వేశాలు, కోలాటం, భజనలు నిర్వహించారు. తిరునాళ్లలో మంత్రి జోగి రమేష్ ఆదివారం రాత్రి పాల్గొన్నారు. కానూరులో జరిగిన ప్రభోత్సవం కార్యక్రమం సందర్భంగా మంత్రి వచ్చిన సమయంలో ఆయనను ఎడ్లబండిపై ఊరేగించారు. మంత్రి ప్రభలకు పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం ప్రభోత్సవం, తిరునాళ్లలో పాల్గొన్నారు. గ్రామ మాజీ సర్పంచి దేవభక్తుని సుబ్బారావు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ దేవభక్తు చక్రవర్తి, మాజీ సర్పంచి అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం గ్రామోత్సవం, 28న ఉదయం 11 గంటలకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.



తిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి విగ్రహాలు



ప్రభోత్సవంలో పాల్గొన్న మంత్రి జోగి రమేష్

ఘనంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామంలోని కోదండరామస్వామి దేవస్థానం ప్రాంగణంలో వైస్ ఎంపీపీ చందు రమాదేవి, చందు శ్రీనివాసరావు గురుస్వామి దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వందలాదిగా తరలివచ్చిన భక్తుల 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. కేరళ శబరిమల దేవస్థానంలో జరిగే పూజా విధానంలో అయ్యప్పకు తోట శివశంకర్ గురుస్వామి నేతృత్వంలో విశేష పూజలు చేశారు. గణపతి హోమం, పూర్ణాహుతి, అష్టదవ్యాభిషేకం కనుల పండువగా జరిగాయి. అనంతరం అయ్యప్పస్వామికి అన్నాభిషేకం నిర్వహించి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఇండియన్ మెడికల్ హాల్ అధినేత కేతినీడి జయప్రకాష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ చందు రమాదేవి, శ్రీనివాసరావు దంపతులు